క్లుప్తంగా

వేణుగోపాలస్వామి ఆలయంలో వేదపారాయణం



తెనాలిటౌన్: రూరల్ మండలం అంగలకుదురులో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా ఆదివారం వేదపారాయణం నిర్వహించారు. అమరావతి మండల యండ్రాయి గ్రామానికి చెందిన గీతా వెంకటేశ్వర వేద పాఠశాల పండితులు మణికంఠ శర్మ శిష్య బృందం సభ్యులు వేద పారాయణం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని ప్రవచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు దివి శ్రీనివాసచార్యులు, గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, గణేష్‌యూత్ సభ్యులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



తెనాలి: పట్టణానికి చెందిన కల్పవృక్ష స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రూరల్ మండల గ్రామం అంగలకుదురులోని ముక్తి ట్రైబల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కల్పవృక్ష సభ్యులు ప్రవీణ్, అశోక్‌కుమార్, భవదీప్, నవీన్‌జైన్, యోగేష్, భావిక్, దర్శన్‌లు వీటిని పిల్లలకు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి శాఖ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, స్కూల్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ జైపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వకర్మ దేవాలయంలో సేవా కార్యక్రమాలు



తెనాలిటౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా కొత్తపేటలోని విశ్వకర్మ దేవాలయాన్ని ఆదివారం శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి సభ్యులు శుభ్రం చేశారు. యోగమండలి వ్యవస్థాపకులు పూజ్యశ్రీ కిషోర్ గురూజీ ఆధ్వర్యంలో యోగ సాధకులు ఆలయంలో చెత్తా చెదారాలను తొలగించారు. ఆలయాన్ని కడిగి ముగ్గులు వేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మండలి సభ్యులు తాడికొండ శ్రీనివాసరావు, ముంతా శ్రీనివాసరావు, నాగరాజు, కోమలదేవి, తల్లం సుబ్బారావు, శివరామిరెడ్డి, లక్ష్మి, సావిత్రి, సుజాత, పలువురు యోగ సాధకులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. తెనాలి మండలం కొలవరం గ్రామంలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పట్టణ బాలాజీరావుపేటకు చెందిన ముక్కామల రాంబాబు మద్యం విక్రయిస్తుండగా అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద తనిఖీ చేయగా 10 మద్యం సీసాలు లభించాయి. దీంతో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బెల్టు షాపు నిర్వాహకుడు అరెస్ట్

తెనాలిరూరల్: బెల్టు షాపు నిర్వాహకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి మండలం గుడివాడ గ్రామంలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఆదివారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న పెరికల వెంకటరత్నం నుంచి ఆరు సీసాలు మద్యం స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూ నగర్: ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం సోమవారం జరుగుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన కార్యక్రమం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. సచివాలయాల్లో ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని స్థానికంగా పరిష్కారం కాని సమస్యల పై నేరుగా తమను కలసి అర్జీలు అందజేయవచ్చని ఆమె తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి



సమావేశంలో మాట్లాడుతున్న వరికూటి

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం కోనేటిపురం పంచాయతీ పరిధిలోని పడమటిపాలెంలో ఆదివారం ఉదయం 'కాఫీ విత్ మై లీడర్స్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు నియోజకవర్గంలో పర్యటించారు. మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో భేటీ అయ్యారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి అందరం కలసికట్టుగా కృషి చేద్దామని తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో సమావేశం అయ్యారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పన విషయంపై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ పడమ శ్రీనివాసరావు, సర్పంచ్ మేరుగ రంగారావు, ఎంపీటీసీ సభ్యురాలు నీలా పాంబమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు బేతపూడి రజనీకాంత్, పరుచూరి వేణు, నీలా రవి కుమార్, జల్లి జోషికాంత్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

భట్టిప్రోలు: గురు శిష్యుల మధ్య ఆత్మీయతా బంధం భారతీయ సంప్రదాయానికి చిహ్నమని పలువురు గురువులు పేర్కొన్నారు. భట్టిప్రోలు టీఎం రావు హైస్కూల్‌లో ఆదివారం 1976 -1977 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ద్వితీయ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కలుసుకొని తమ గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన గురువులు మాట్లాడుతూ భారతీయ సంప్రదాయంలో తల్లిదండ్రులే పిల్లలకు తొలి గురువులని ఆ తర్వాత ఉపాధ్యాయులు గురువులుగా వ్యవహరిస్తారని చెప్పారు. నాలుగున్నర దశాబ్దాల క్రితం ఇక్కడి హైస్కూల్‌లో చదువుకున్న విద్యార్థులు ప్రస్తుతం ఇక్కడ కలుసుకోవడం ఆనందంగా ఉందని పూర్వ ఉపాధ్యాయులు ముద్దా లీలామోహన్‌రావు, లాల్‌జాన్‌భాషా, కొణతం నాంచారయ్య, ప్రస్తుత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు, చందలూరి రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు వైవీ రమణ, ఆంజనేయులు, నాగరాజు, కన్యాకుమారి, మద్దుల గణేష్, పసుపులేటి శివరామ ప్రసాద్, ప్రేమలత మైత్రేయి, మాజేటి వెంకటేశ్వరరావు, గొట్టుముక్కల గోపాల్, చెక్కా రమణ, తదితరులు పర్యవేక్షించారు. అనంతరం ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందిని పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా పాల్గొని సహపంక్తి భోజనాలు చేసి ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

విశ్వ బ్రాహ్మణ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



భట్టిప్రోలు: అఖిల భారత విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి పామర్తి లింగాచారి (విష్ణుష్) ఆదివారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఈ క్యాలెండర్‌ను అశోక్‌బాబు చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభ్కారి, గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి, వడ్రంగి అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కోడూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముస్లింలకు ఎన్నికల్లో ప్రాధాన్యం కల్పించాలి

బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలోని ఇస్లాంపేట షాదిఖానా నందు బాపట్ల నియోజకవర్గ ముస్లిం వెల్ఫేర్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రషీద్ ఆధ్వర్యంలో ఆదివారం ముస్లిం సోదరులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ బాపట్ల ప్రధాన జిల్లా కేంద్రం నందు రాబోయే ఎన్నికలలో ఏ పార్టీ అయితే ముస్లింలకు ప్రాధాన్యత ఇచ్చి అసెంబ్లీ టిక్కెట్లు కేటాయిస్తారో వారికి ముస్లింల నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని వెల్లడించారు. బాపట్ల నియోజకవర్గం మొత్తం మీద దాదాపు 25 వేల పైచిలుకు ఓట్లు ఉన్న ముస్లింలకు అసెంబ్లీ టిక్కెట్ కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. బాపట్ల నియోజకవర్గం నుంచి ఈ సమావేశానికి మైనార్టీలు వందల సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

తారకరామయ్య మృతి తీరని లోటు

పిట్టలవానిపాలెం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తారక రామయ్య మృతి తీరని లోటని బాపట్ల శాసన సభ్యులు కోనరఘుపతి అన్నారు. మండలంలోని సంగుపాలెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన తారక రామయ్య దశ దిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలదండ వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొలగాని సుబ్బారావు, దబ్బుకూటి మాధవరావు, దబ్బుకూటి సీతారామయ్య తదితరులు ఉన్నారు.

ఫ్లెక్సీల చించివేతపై ఫిర్యాదు

రేపల్లె రూరల్: రేపల్లె పట్టణంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ నేతల మధ్య ఆదివారం ఫ్లెక్సీల వివాదం చోటు చేసుకుంది. నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టణంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చించివేశారు. అయితే తమ ఫ్లెక్సీలను టీడీపీ నాయకులు ఉద్దేశ్య పూర్వకంగా చింపారని వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా పట్టణంలో పలుచోట్ల ఉన్న టీడీపీ ఫ్లెక్సీలు చిరిగి ఉండటంతో తమ ఫ్లెక్సీలు వైఎస్సార్ సీపీ నేతలు చింపి ఉంటారని టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదులను నమోదు చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు రామ్మోహన్‌రావు

కర్లపాలెం: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాల మేరకు మందులు వాడాలని ప్రముఖ మధుమేహ వైద్యులు చల్లా రామోహన్‌రావు తెలిపారు. రామకృష్ణ సేవా సమితిలో ఆదివారం పేరలి నరసయ్య మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 100 మంది మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో డాక్టర్ చల్లా రామోహన్‌రావు మాట్లాడుతూ మధుమేహ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఆహార నియమాలు పాటించాలని చెప్పారు. మధుమేహ వైద్య శిబిరాలను ఉచితంగా ఏర్పాటు చేస్తున్న పేరలి నరసయ్య మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు, ప్రముఖ నేత్ర వైద్యుడు పేరలి బాలకృష్ణమూర్తి సతీమణి గిరిజాకుమారి ఇటీవల మృతిచెందటంతో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి రామకృష్ణ సేవా సమితి సభ్యులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు టివి సుబ్బారావు, వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరరావు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమస్యల సాధనకు కృషి

రేపల్లెరూరల్: తపాలా ఉద్యోగులు తమ సమస్యల సాధనకు ఐక్యమత్యంతో కృషి చేయాలని రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్ డీఎల్ కాంతారావు అన్నారు. భారతీయ మజ్దూర్ యూనియన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని హెడ్‌పోస్ట్ ఆఫీస్ కార్యాలయ ఆవరణంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం డాక్‌సేవక్‌లకు వెంటనే సివిల్ సర్వెంట్ హోదా ఇవ్వాలన్నారు. కుటుంబ సభ్యులతో సహా వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. కమలేష్‌చంద్ర కమిటీ చేసిన సిఫార్సును అమలు చేయాలన్నారు. జీడీఎస్ కాంట్రిబ్యూషన్ 10శాతం, డిపార్ట్‌మెంట్ 10శాతం కాంట్రిబ్యూషన్ ఇవ్వటంతో పాటు తాత్కాలిక పెన్షన్ అందించాలన్నారు. అదేవిధంగా తపాలాశాఖలో శాఖాపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్‌పీఈ రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ ఎ.పోతురాజు, బీఎంఎస్ తెనాలి డివిజన్ అధ్యక్షుడు నరేంద్ర, తెనాలి డివిజన్ ఎస్ఎఫ్‌పీఈ సెక్రటరీ లక్ష్మీరాజ్యం, యూనియన్‌ల నాయకులు గోపి, నాగరాజు, కిరణ్, బాబ్జి, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ రామారావుకు జీవిత సాఫల్య పురస్కారం



అవార్డు అందుకుంటున్న డాక్టర్ రామారావు

గుంటూరు రూరల్: ఉపాధ్యాయ వృత్తిలో తనదైన ముద్ర వేసి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసిన గొప్ప వ్యక్తి డాక్టర్ నాదెండ్ల రామారావు అని చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ అంజనేయులు అన్నారు. ఆదివారం నగర శివారులోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రొఫెసర్ రామారావు 2023వ సంవత్సరానికి గానూ జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. రాజమండ్రిలోని వీజే ఫార్మసీ కళాశాలలో జరిగిన పురస్కార వేడుకల్లో న్యూఢిల్లీకి చెందిన ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ దీపేంద్ర సింగ్, సౌత్ రీజియన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎం.వి. రమణ, ఈసీ సభ్యులు డాక్టర్ ఎం. రాధాకృష్ణమూర్తి, డాక్టర్ ఎస్ఎల్ఎన్ ప్రసాద్‌రెడ్డి అవార్డు ప్రదానం చేసినట్లు చెప్పారు. ఫార్మసీ ఆయన మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ అనుభవంతో 7 పుస్తకాలు, 3 పేటెంట్‌లు, ఎన్నో ప్రచురణలు, నూతన ఆవిష్కరణలు చేశారని వివరించారు. అదేవిధంగా ఆయన ఎన్నో అవార్డులు, పొందారని తెలిపారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్, అధ్యాపకులు అవార్డు పొందిన రామారావును అభినందించారు.

ఆధునిక కంటి వైద్య విధానంపై అవగాహన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కార్నియా స్పెషలిస్ట్ డాక్టర్ జేకే రెడ్డి, వైద్యులు

పెదకాకాని: ఆధునిక కంటి వైద్య విధానంపై అవగాహన సదస్సు.. కంటి వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని కోయంబత్తూరు శంకర కంటి ఆసుపత్రి కార్నియా స్పెషలిస్ట్ డాక్టర్ జేకే రెడ్డి అన్నారు. పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి, శంకర అకాడమీ ఆఫ్ విజన్ నేతృత్వంలో ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో ఆదివారం ఆధునిక కంటి వైద్య విద్యా విధానంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ జేకే రెడ్డి మాట్లాడుతూ వైద్య రంగంలోని మార్పులు, ఆధునిక చికిత్సా విధానం వైద్య విద్యార్థులకు ఉపయోగపడుతాయన్నారు. మధురై శంకర కంటి ఆసుపత్రి డాక్టర్ మహేష్ కంటికి సంబంధించి ప్రశ్నలకు, సందేహాలకు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి శంకర కంటి ఆసుపత్రి సీఈఓ డాక్టర్ సుధాకర్ పొట్టి అధ్యక్షత వహించారు. పర్యవేక్షకులుగా రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ నుంచి డాక్టర్ వి.సోమశేఖర్, డాక్టర్ పర్నికుమార్, డాక్టర్ మోపర్తి శివప్రసాద్, డాక్టర్ రామలింగారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పలు జిల్లాల నుంచి 210 మంది నేత్ర వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు నమోదులో అలసత్వం వద్దు

చుండూరు(వేమూరు): 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దారు బి కనకదుర్గ సూచించారు. చుండూరు మండల కేంద్రంలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో ఇంటింటికీ రక్తపూతల సేకరణ



బోదకాలు వ్యాధి నిర్ధారణకై రక్తపూతలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల గ్రామంలో బోదకాలు వ్యాధి నిర్ధారణకై రక్తపూతల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం మాట్లాడుతూ బోదవ్యాధి నిర్ధారణకు రాత్రి సమయంలో రక్తపూతల సేకరణ చేయాలని అలా చేస్తే మానవ రక్తంలో ఉన్న మైక్రో ఫైలేరియా క్రిమిని గుర్తించవచ్చని, తద్వారా బోదకాలు వ్యాధి రాక ముందే మందులను వాడడం ద్వారా ఈ వ్యాధిని సమూలంగా నిర్మూలించవచ్చని వివరించారు. ప్రజలందరూ రాత్రిపూట సేకరించే ఈ రక్తపూతల సేకరణ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి, తెనాలి మలేరియా సబ్ యూనిట్ అధికారి వంగల పున్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న హనుమధీశ్వర మహాయజ్ఞం



హారతినిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్-పుష్ప దంపతులు

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆవరణలో జరుగుతున్న శ్రీ చండీసహిత హనుమధీశ్వర మహాయజ్ఞం రెండోరోజూ వైభవంగా కొనసాగింది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్-పుష్ప దంపతుల ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం, తెనాలి నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలన్న ఆకాంక్షతో చేపట్టిన మహాయజ్ఞంలో భాగంగా ఆదివారం ఉదయం సూర్యభగవానుడికి విశేష అర్చన, ఆదిత్య హృదయ పారాయణతో పూజాకార్యక్రమాలను ప్రారంభించారు. శ్రీ దక్షిణామూర్తిస్వామి, శ్రీ సీతారామచంద్రసమేత శ్రీఆంజనేయస్వామికి పూజలు చేశారు. బ్రహ్మశ్రీ రేలంగి ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన యజ్ఞాన్ని వందలాది భక్తులు విచ్చేసి ప్రత్యక్షంగా తిలకించారు. స్వామివార్ల విగ్రహాలకు నమస్కరించుకున్నారు. హోమం అనంతరం మంత్రపుష్పంతో రెండోరోజు కార్యక్రమం ముగిసింది. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అంతకుముందు ఉదయం ఆరున్నర గంటలకు శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సేవాసమితి, సంకీర్తన సేవాసమితి సభ్యులచే సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి సహా నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు, వైఎస్సార్‌సీపీకి చెందిన ముఖ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, శ్రీవాసవీ దేవస్థానం కమిటీ నాయకులు పాల్గొన్నారు.

పీడిత ప్రజానీకం ఆత్మ బంధువు ఏసురత్నం



ఏసురత్నం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

తెనాలి: అంబేడ్కరిస్టుగా పీడిత ప్రజల విముక్తి కోసం పరితపించిన విప్లవ స్వాప్నికుడు కనపర్తి ఏసురత్నం అని తొలి దళిత కవయిత్రి ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. పీడితుల విముక్తితోనే సమ సమాజం వస్తుందని విశ్వసించి, క్షేత్రస్థాయిలో దళిత ఉద్యమ నిర్మాణానికి కృషిచేస్తూ, చివరివరకు అదే ఆశయానికి శ్వాసించారని చెప్పారు. నిబద్ధత గల ఉద్యమకారుడు ఏసురత్నం ఆశయాల సాధన కోసం కృషిచేయడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. ఇటీవల హఠాన్మరణం చెందిన కొల్లిపరకు చెందిన ప్రతిఘటనోద్యమ దళ సారథి 'కనపర్తి ఏసురత్నం జ్ఞాపకాలతో ఒకరోజు సాయంత్రం'ను పట్టణ సాహితీ సాంస్కృతిక సంస్థ భిన్నస్వరాలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఇక్కడి కవిరాజ పార్కులోని వీజీకే భవన్లో ఏర్పాటైన సభకు సంస్థ నిర్వాహకులు జీఎస్ నాగేశ్వరరావు, కనపర్తి బెన్‌హర్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ఏసురత్నంను తమ కాలపు పూలే, పెరియార్‌గా భావిస్తున్నామని అన్నారు. దళిత బహుజన ఉద్యమకారుడు వేము సమత మాట్లాడుతూ సునిశిత పరిశీలనా శక్తి కలిగిన ఏసురత్నం అంబేడ్కర్‌ను అవలోకనం చేసుకున్నారని చెప్పారు. హెచ్చు తగ్గుల సమాజంలో అంబేడ్కర్ ఉద్యమ వ్యాప్తికి కృషిచేశారని వివరించారు. వివిధ ప్రజాసంఘాల నేతలు సత్యనారాయణ, కోలా జ్యోతి, భేతాళ ప్రసాద్, యంద్రపాటి అశోక్, గుంటి సురేష్, కాబోతు ఈశ్వరరావు, కె.బాబూప్రసాద్, ఉమ, బొల్లిముంత కృష్ణ, శివకృష్ణ, నండూరి నారాయణరావు, జ్ఞానరాజు మాట్లాడారు.తొలుత ఏసురత్నం చిత్రపటానికి నివాళులర్పించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ లక్ష్మీలావణ్య

తెనాలిఅర్బన్: రజక వలంటరీ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆదివారం రజక చెరువు సమీపంలోని సంస్థ కార్యాలయంలో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన 24వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య మాట్లాడుతూ పదో తరగతిలో మంచి మార్కులు సాధించేందుకు మెటీరియల్ ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. ఆర్‌వీఎస్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అన్ని సబ్జెక్టులలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు జిల్లా అసిస్టెంట్ మేనేజర్ పి.నారాయణరావు, ఆర్‌వీఎస్ అధ్యక్షుడు పోతార్లంక ప్రసాద్, నాయకులు కొండవీటి శ్రీనివాసరావు, వీర్లపాటి మురళీకృష్ణ, పేటేటి శ్రీనివాస్, మునిపల్లి వంశీ, నాంచారయ్య, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి సాయం



బాపట్ల: వృద్ధాప్యంతో పాటు పేదరికంలో ఉన్న ఫొటోగ్రాఫర్ ఎస్కే నూరుకు బాపట్ల ప్రగతి ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సాయంగా నిలిచింది. ఆదివారం ఆయన నివాసానికి అసోసియేషన్ నాయకులు వెళ్లి నిత్యావసర సరుకులు అందించారు. ప్రధాన కార్యదర్శి బీఎం జయరావు మాట్లాడుతూ సీనియర్ ఫొటోగ్రాఫర్‌గా ఎస్కే నూరు ఎంతో మందికి ఉపాధి మార్గాలు చూపారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, కృష్ణ, పులుగు నాగేశ్వర్‌రెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, వెంకట్రావు,ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

ముగిసిన జేకేఏ క్యూలెవల్ కరాటే బెల్ట్ పోటీలు



కరాటే పోటీలలో బెల్టును సాధించిన చిన్నారులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లిలో జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఎ.పి. చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కొడాలి రవిబాబు, జోనల్ ఇన్‌స్ట్రక్టర్ కొడాలి సాగరిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కరాటే పోటీలు ఆదివారంతో ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వ్యాపార వేత్త చాగంటి సాగర్ చందు రెడ్డి విచ్చేసి ఉత్తీర్ణులైన వారికి బెల్ట్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కరాటేను బ్లాక్ బెల్ట్ వరకు అయినా నేర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆడపిల్లలు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ జె.కె.ఎ. క్యూలెవల్ బెల్ట్ పోటీలలో ఎ.ఐ.ఎం.ఇ.ఇ. ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు పొట్లూరి అన్వీ, పొట్లూరి అర్జున్‌లు పొందగా, చాగంటి స్నేహిత, యస్. అక్షిత, చాగంటి గోవర్ధన్‌రెడ్డిలు గ్రీన్ బెల్ట్‌ను, ఎస్.డి.ఆర్.ఎఫ్. విద్యార్థులు ఎండి అయాన్, ఎం. నికిల, వి. సాయి శరణ్‌లు ఆరెంజ్ బెల్ట్‌ను, చాగంటి స్నిగ్ధ, ఎండి అకీబ్ ఎల్లో బెల్ట్‌ను, ఎం. యషిత, యస్. శక్తి, కె. రోహినిక్ రవిరెడ్డి, ఎ. పూర్ణ తిరుమల హిమబిందు, ఎన్. అష్విత్ తేజ్, ఎ. ధవన్, ఎస్. బ్రహ్మతేజ్,యస్. వసంత ప్రియన్‌లు జూనియర్ రెడ్ బెల్టులను పొందారు.

భక్తి శ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణ

పాత గుంటూరు: 'మార్గశిర ధనుర్మాస ఏకాదశి' పర్వదినం సందర్భంగా బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలోని శ్రీ పద్మావతి కళ్యాణ వేదికపై ఆలయ పాలకమండలి, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో విశ్వ శ్రేయస్సును కాంక్షిస్తూ (108 పర్యాయాలు) శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, ఆలయ అధ్యక్షులు సి.హెచ్. మస్తానయ్య, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన గురువులు కె.వి కోటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. దార్మిక ప్రాంగణంలోని యాగశాలలో 'భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్' ఆధ్వర్యంలో 13 మంది రుత్వికులతో శ్రీ చండీ పారాయణ, భక్తులచే' శ్రీ లలితా సహస్రనామ పారాయణ' నిర్వహించారు.ప్రముఖ ఆధ్యాత్మికులు నంబూరు సాంబశివరావు ఆధ్వర్యంలో రమాదేవి చక్ర కుంకుమ' పూజ నిర్వహించారు.